## మున్నూరుకాపు వసతిగృహంలో..

### అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

కాచిగూడ, జూన్ 12: 2025-26 సంవత్సరానికి సంబంధించి ఎంబీబీఎస్, ఎంకామ్, ఎంటెక్, ఎంఎస్సీ, ఎంబీఏ, ఎంసీఏ, ఎం ఫార్మసీ, బి ఫార్మసీ తదితర ప్రొఫెషనల్ కోర్సుల్లో చదివే విద్యార్థులకు హాస్టల్ అడ్మిషన్లకు తెలంగాణ వ్యాప్తంగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మున్నూరుకాపు వసతి గృహం ట్రస్ట్ బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ మ్యాడమ్ వెంకట్ రావు తెలిపారు. గురువారం కాచిగూడ విద్యార్థి వసతి గృహం కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. హాస్టల్‌లో అడ్మిషన్లకు ఆసక్తిగల విద్యార్థులు ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 14 నుంచి 28వ తేదీ వరకు దరఖాస్తులను సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు 040-24658160 /7404, 9491 627404 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

## పనులు సకాలంలో పూర్తిచేయాలి

### చీఫ్ ఇంజనీర్ భాస్కర్ రెడ్డి

సిటీబ్యూరో, జూన్ 12 (నమస్తే తెలంగాణ): నాణ్యతలో రాజీ పడకుండా పనులను సకాలంలో పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ చీఫ్ ఇంజనీర్ భాస్కర్ రెడ్డి సబార్డినేట్‌లను ఆదేశించారు. గురువారం ఆయన చార్మినార్ జోన్‌లోని పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ తనిఖీలో శాస్త్రిపురం ఆర్వోబీ, ఫలక్‌నుమా ఆర్‌ఓబీ, నల్లగొండ క్రాస్ రోడ్ నుంచి ఓవైసీ ఫ్లై ఓవర్, అజీమ్ హోటల్ రోడ్డు, గుర్రం చెరువు డ్రైయిన్ పనులను పరిశీలించారు. కొన్ని ప్రదేశాలలో స్థల పరిమితులు, సామగ్రి సరఫరా సమస్యలు, సమన్వయ సవాళ్ల కారణంగా జాప్యం జరుగుతోందని.. పనులను వేగవంతం చేయాలని చెప్పారు. పర్యవేక్షణను నిశితంగా పరిశీలించి పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

## రవీంద్రభారతిలో ఆర్ట్ ఎగ్జిబిషన్

రవీంద్రభారతి, జూన్ 12 : పికాసో ది స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ నిర్వహించే 'బియాండ్ ది బ్రష్' చిత్రకళ ప్రదర్శన పోస్టర్‌ను తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతి శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ గురువారం రవీంద్ర భారతిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిత్రలేఖనం అనేది అద్భుతమైన కళ అని పేర్కొన్నారు. పికాసో ది స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు అనేక చిత్రకళ ప్రదర్శనలను రవీంద్ర భారతిలో ప్రదర్శించారని అన్నారు. పికాసో ద స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ ఫౌండర్ అండ్ డైరెక్టర్ బైరు రమేష్ మాట్లాడుతూ.. ఈనెల 22వ తేదీ నుంచి 24వ తేదీ వరకు రవీంద్ర భారతిలో 'బియాండ్ ది బ్రష్' ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. చిత్రకళ అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రదర్శనను తిలకించాలని కోరారు. కార్యక్రమంలో టీచర్ శిరీష, ఆర్ట్ రైటర్ ఎం.పూజ మాధురి, శివ, పద్మావతి, రమ్య తదితరులు పాల్గొన్నారు.

## గద్దర్ అవార్డులను రద్దుచేయాలి

రవీంద్ర భారతి, జూన్ 12 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గద్దర్ అవార్డులను రద్దు చేయాలని తెలంగాణ సినిమా వేదిక గౌరవ అధ్యక్షుడు తుమ్మల ప్రఫుల్ రామ్ రెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ సినిమా వేదిక ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ ఫిలిం అవార్డులను ఆంధ్ర సినిమాలకు ఇవ్వకూడదని హైకోర్టులో పిటిషన్ వేశామని తెలిపారు. పిటిషన్ స్వీకరించిన కోర్టు రేపు వాదనను విననుందన్నారు. కోర్టు ద్వారా తెలంగాణ సినిమాకు న్యాయం జరుగుతుందని భావిస్తున్నామని రామ్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు గడిచినప్పటికీ సినిమా రంగంలో ఆంధ్ర సినీ పెద్దల ఆధిపత్యం కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ సినిమా రంగంలో పనిచేస్తున్న వారితో జ్యూరీ కమిటీని ఏర్పాటు చేసి కేవలం తెలంగాణ సినిమాలకు మాత్రమే అవార్డులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర కన్వీనర్ లారా, కోకన్వీనర్ మోహన్ బైరాగి, జీ రవి, టీసీవీ రాష్ట్ర నాయకులు.. చంద్రన్న ప్రసాద్, సాయి, కృష్ణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# హెచ్ఎండీఏలో అడ్డగోలు నియామకాలు

- ఉద్యోగాల భర్తీలో ప్రభుత్వ నిబంధనలకు తూట్లు
- లేనిపోస్టును క్రియేట్ చేసి మరీ రిక్రూట్‌మెంట్
- ఏకంగా విభాగాధిపతిగా పొరుగు రాష్ట్రం వ్యక్తికి అవకాశం
- తదనంతరం అవుట్ సోర్సింగ్ విధానంలో మరికొంతమంది నియామకం
- తెలంగాణ యువతకు తీరని అన్యాయం!




సిటీబ్యూరో, జూన్ 11(నమస్తే తెలంగాణ): హెచ్ఎండీఏలో ఇష్టారాజ్యం పాలన విధానాలు వెలుగులోకి వస్తున్నాయి. ఏడాదిన్నర కిందటే పురపాలక శాఖ పరిధిలో ఎలాంటి నియామకాలు చేయరాదంటూ ఉన్న ఉత్వర్తులను బేఖాతారు చేస్తూ, నిబంధనలకు తూట్లు పొడుస్తూ నూతన నియామకాలు చేపట్టారనే ఆరోపణలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. ఇన్‌చార్జి మెట్రోపాలిటన్ కమిషనర్ నుంచి పూర్తిస్థాయి కమిషనర్ నియామాకం తర్వాతనే హెచ్ఎండీఏలో ఈ ఉద్యోగాలను భర్తీ చేయడం ఇప్పుడు పలు అనుమానాలకు తావిస్తోంది. అవేవో సాదాసీదా ఉద్యోగాలు అనుకుంటే పొరపాటే... లక్షల రూపాయాల జీతభత్యాలుగా చెల్లించే ఉద్యోగాలు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతోనే ముఖ్యంగా పురపాలక శాఖ ఉద్యోగాల భర్తీపై కీలక ప్రకటన చేసింది. ఆ శాఖలో ఎలాంటి పోస్టులను కొత్తగా ఏర్పాటు చేయరాదని.. ప్రభుత్వ అనుమతులు ఉంటే తప్పా భర్తీ చేయవద్దని పేర్కొంటూ ఉత్తర్వులు జారీ చేసింది.

### ఉత్వర్వులు బేఖాతరు..

అయితే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన 3 నెలలకే హెచ్ఎండీఏ ఏర్పాటైన నాటి నుంచి ఇప్పటివరకు లేని పోస్టును క్రియేట్ చేసి లక్షల్లో జీతాలను కట్టబెడుతున్నారు. అదే విధంగా ప్రస్తుతం ఆన్‌లైన్ విధానంలోనే హెచ్ఎండీఏ వ్యవహారాలు జరుగుతున్న నేపథ్యంలో ఐటీ విభాగం ముఖ్య భూమికను పోషిస్తోంది. గతంలో ఈ విభాగాధిపతిగా గ్రూప్-2 స్థాయికి మించిన అధికారికి బాధ్యతలు అప్పగించగా... కీలకమైన ఈ విభాగానికి ఓ వ్యక్తిని అవుట్ సోర్సింగ్ విధానంలో భర్తీ చేసి విభాగాధిపతి బాధ్యతలను అప్పగించడంలో హెచ్ఎండీఏ ఉన్నతాధికారుల ప్రమేయం ఇప్పుడు పలు అనుమానాలకు తావిస్తోంది.

### నూతన పోస్టు క్రియేట్ చేసి మరీ..

3 నెలల క్రితమే హెచ్ఎండీఏ పరిధిని 11 జిల్లాలకు విస్తరించగా... ఇప్పటికీ ఉద్యోగాల నియామాకాలపై చర్యలు తీసుకోలేదు. అయితే ఏడాది క్రితమే ఉద్యోగాలను భర్తీ చేయవద్దంటూ ప్రభుత్వం ఆదేశించినా హెచ్ఎండీఏ ప్రమోషన్ పేరిట ఓ విభాగాధిపతికిగా అధికారిని నియమించారు. కేవలం మౌలిక వసతులు, పట్టణాభివృద్ధిలో కీలకంగా వ్యవహరించే హెచ్ఎండీఏలో అంతగా ప్రమోషన్స్ చేయడానికి ఓ విభాగాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏముందనీ హెచ్ఎండీఏలోని ఓ విభాగాధిపతి వ్యాఖ్యానించారు. గతంలో ఈ తరహా పోస్టు లేదనీ, కొత్తగా మెట్రోపాలిటన్ కమిషనర్ వచ్చిన తర్వాత ఈ నియామకం జరిగినట్లుగా తెలుస్తోంది.

### అవుట్ సోర్సింగ్ వ్యక్తులే విభాగాధిపతులు..

హెచ్ఎండీఏ వ్యవహారాలలో ఐటీ విభాగానిదే కీలకపాత్ర. రెవెన్యూ తీసుకువచ్చే ప్లానింగ్ విభాగం మొత్తం కూడా ఐటీ శాఖ ఆధారంగా పనిచేస్తోంది. ఇలాంటి కీలకమైన ఈ విభాగానికి అవుట్ సోర్సింగ్ విధానంలో ఓ వ్యక్తిని విభాగాధిపతిగా ఎందుకు నియమించాల్సి వచ్చిందనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. తెలంగాణలో ఐటీ నిపుణులే లేనట్లుగా ఇతర రాష్ట్రానికి చెందిన వ్యక్తికి ఆ బాధ్యతలు అప్పగించడం వెనుక పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆయన బాధ్యతలు స్వీకరించడంతోనే ఐటీ విభాగం బలోపేతం పేరిట అవుట్ సోర్సింగ్ విధానంలో సిబ్బంది భర్తీ, కొత్త కంప్యూటర్ పరికరాల కొనుగోళ్లు చకచకా జరిగిపోయాయి. టెక్నాలజీలో నిపుణులనీ చెప్పుకున్నా... ఇప్పటికీ హెచ్ఎండీఏ వెబ్‌సైట్‌లో వచ్చే లోపాలను సవరించలేకపోయారని, కనీసం మారిన అధికారుల వివరాలను కూడా ఇప్పటికీ సరిచేయలేదనే విమర్శలు ఉన్నాయి. ఏడాది కిందట హెచ్ఎండీఏ వెబ్‌సైట్‌లో నిషేధిత లే అవుట్ల జాబితా కనిపించడం వెనుక ఆ అధికారి అసమర్థతతే కారణమనే ఆరోపణలు ఉన్నాయి. కానీ ఉన్నతస్థాయి అధికారికి అత్యంత ఆప్తులు కావడంతోనే ఆ శాఖను ఆయన చేతిలో పెట్టారని, అదే విధంగా మరో అధికారిని కూడా అదే విధంగా నియమించుకున్నారన్న విషయం ఇప్పుడు హెచ్ఎండీఏ సిబ్బందిలో చర్చనీయాంశంగా మారింది.

# బీఆర్ఎస్ ప్రభుత్వం ఇండ్లు ఇస్తే..

- కాంగ్రెస్ ప్రభుత్వం నీడ లేకుండా చేసింది
- భాగ్యనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్




సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ఖైరతాబాద్, జూన్ 12: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇండ్లు కేటాయిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి నిలువ నీడ లేకుండా చేసిందని భాగ్యనగర్ వేల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2023 సెప్టెంబర్ నెలలో తుక్కుగూడలో బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టించిన డబుల్ బెడ్రూం గృహాలను మొదటి ఫేజ్‌లో సుమారు 1,730 మందికి లాటరీ పద్ధతిలో కేటాయించారన్నారు. అందులో అత్యధిక శాతం యాకుత్‌పురా, చంద్రాయాణగుట్ట, మలక్‌పేట్, చార్మినార్ నియోజకవర్గాలకు చెందిన లబ్ధిదారులే అధికంగా ఉన్నారన్నారు. అయితే రంగారెడ్డి జిల్లాకు చెందిన కొందరు స్థానికులు జీవో నం.10 ద్వారా తాము అర్హులు కాదని, స్థానికులకే అవకాశం ఇవ్వాలంటూ హైకోర్టును ఆశ్రయించగా, వారికి అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. అయితే గత రెండు సంవత్సరాలుగా అధికారులు చుట్టూ తిరుగుతున్నా తమకు సరైన పరిష్కారం చూపలేదన్నారు. వారి నిర్లక్ష్యంగా కారణంగానే తాము నీడ లేకుండా మిగిలిపోయామన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పేదవర్గాలైన తమను పట్టించుకోవడం లేదని, 1,730 మంది పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. సొంత ఇళ్లు కేటాయింపు జరిగినా కిరాయి ఇండ్లలో ఉండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. 20 రోజుల్లో తమ సమస్య పరిష్కరించకుంటే లబ్ధిదారులందరం కలిసి ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడిస్తామన్నారు. ఈ సమావేశంలో బాధితులు శేషు, ఇబ్రహీం, శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

# మున్నూరుకాపులను నిరాశపరిచారు

### సంఘం జగిత్యాల జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

ఖైరతాబాద్, జూన్ 12: రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో మున్నూరుకాపులకు స్థానం ఇవ్వకుండా కాంగ్రెస్ సర్కార్ నిరాశపరిచిందని తెలంగాణ మున్నూరుకాపు సంఘం నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆ సంఘం జగిత్యాల జిల్లా అధ్యక్షుడు చెదల సత్యనారాయణ మాట్లాడుతూ.. రాష్ట్ర జనాభాలో 40 లక్షలకు పైగా మున్నూరుకాపు జనాభా ఉందని, ఎన్నికల్లో గెలుపోటములను నిర్ణయించే సత్తా తమ సామాజికవర్గానికి ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు సీట్ల కేటాయింపులోనూ తమ సామాజికవర్గానికి అన్యాయం జరిగిందని.. నామమాత్రపు సీట్లు కేటాయించారన్నారు. ఉన్న ఒక్క ఎమ్మెల్యేకు సైతం మంత్రి పదవి ఇవ్వలేదని, గత ప్రభుత్వ హయాంలో మున్నూరుకాపులకు ప్రాతినిధ్యం కల్పించారని సత్యనారాయణ గుర్తుచేశారు. మరోసారి మంత్రి వర్గ విస్తరణ ఉంటుందని వార్తలు వస్తున్న నేపథ్యంలో..అందులో తమ సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యే ఆదిశ్రీనివాస్‌కు స్థానం కల్పించాలని..లేని పక్షంలో తమ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జల్లేపల్లి వెంకటేశ్వర్లు, వివిధ జిల్లాల అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు బొప్ప దేవయ్య, చెక్కల తిరుపతి, ఆకుల శ్రీనివాస్, దూళిపాల శ్రీనివాస్ రావు, వేములవాడ సత్రం ట్రస్ట్ ఉపాధ్యక్షులు కొమురయ్య పాల్గొన్నారు.

## బోనాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు

### ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు రాఘవేందర్

చార్మినార్, జూన్ 12: ఆషాఢ మాసం బోనాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు గోపిశెట్టి రాఘవేందర్ వెల్లడించారు. గురువారం అక్కన్న మదన్న దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బోనాల ఉత్సవాల కోసం ప్రభుత్వం గతేడాది రూ.20 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ సంవత్సరం అదనంగా మరో రూ.10 కోట్లు మంజూరు చేయడానికి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈనెల 27న గోల్కొండ జగదాంబ అమ్మవారికి, 29న బెజవాడ కనకదుర్గమ్మ వారికి, జూలై 2వ తేదీన బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారికి. 10వ తేదీన ఉజ్జయిని మహంకాళీ అమ్మవారికి, 15వ తేదీన చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారికి, 17 తేదీన లాల్ దర్వాజా సింహవాహిని అమ్మవారికి బంగారు బోనం సమర్పించనున్నట్లు తెలిపారు.

# వేయని రోడ్డుకు బిల్లు.. ఖజానాకు చిల్లు

సిటీబ్యూరో, జూన్ 12 (నమస్తే తెలంగాణ): ఇటీవల మాన్‌సూన్ ఎమర్జెన్సీలో భాగంగా ఇసుజు వాహనాల టెండర్లలో అక్రమాలకు తెరలేపడం, వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టి సంబంధిత టెండర్‌ను రద్దు చేసి మాన్‌సూన్ ఎమర్జెన్సీ పనులను జీహెచ్ఎంసీ నుంచి హైడ్రాకు బదలాయించారు. తాజాగా చేయని పనులకు బిల్లులు పెట్టి ఖజానాకు టోకరా వేసిన ఘటన వెలుగులోకి రావడం గమనార్హం. మొత్తంగా సీఎం రేవంత్‌రెడ్డి నిర్వర్తిస్తున్న పురపాలక శాఖ పరిధిలో జీహెచ్ఎంసీలో అవినీతి తంతు తారాస్థాయికి చేరడం, జీహెచ్ఎంసీపై పురపాలక శాఖ మంత్రిగా ఇప్పటివరకు సమీక్ష జరపకపోవడం పట్ల విమర్శలు వెలువెత్తుతున్నాయి.

### ఫిర్యాదులో వెలుగులోకి భాగోతం

జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారుల చేతివాటం బట్టబయలైంది. పనులు చేయకుండా చేసినట్లు దొంగ రికార్డులను సృష్టించి సంస్థని బురిడీ కొట్టించారు. లక్షలాది రూపాయలను, కాంట్రాక్టర్ అధికారులు ఖజానాకు గండి కొట్టిన సంఘటన సంతోష్ నగర్ సర్కిల్ పరిధిలోని ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని సింగరేణి కాలనీలో చోటుచేసుకుంది. తమకు తెలియకుండానే డివిజన్‌లో అభివృద్ధి పనులు చేసినట్లు లెక్కలు చూపించిన అధికారుల భాగోతం వెలుగులోకి రావడంతో స్థానికులు అవాక్కయ్యారు. ఇదే విషయాన్ని కౌన్సిల్ వేదికగా స్థానిక కార్పొరేటర్ జంగం శ్వేత కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. తన డివిజన్లో జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ జరిపించి కాంట్రాక్టర్, సంబంధిత అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్‌కు ఆమె వినతిపత్రం అందజేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు క్వాలిటీ కంట్రోల్, విజిలెన్స్ బృందం విచారణ చేపట్టింది. ఫోర్జరీ చేసి సదరు కాంట్రాక్టర్, ఇంజినీర్లు బిల్లులు నొక్కేసినట్లు తేల్చారు.

### అసలేం జరిగిందంటే ?

గత ఏడాది వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని సింగరేణి కాలనీ వాంబే క్వార్టర్స్‌లో సీసీ రోడ్డు నిర్మాణం కోసం పని ఐడీ 24041451, టెండర్ ఐడీ 53998 కేటాయించి, 8 లక్షల 93 వేల 223 రూపాయలను మంజూరు చేశారు. పని నిర్ధారించి తొమ్మిది లక్షల 90 వేలకు ప్రాజెక్టు అమౌంట్‌గా పేర్కొన్నారు. సీసీ రోడ్డు నిర్మాణ పనులు ఎంఎస్ ఖాన్ కన్స్ట్రక్షన్ కాంట్రాక్టర్‌కు 2024 ఆగస్టు 26న అప్పగించారు. సదరు కాంట్రాక్టర్ స్థానికంగా ఎటువంటి సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేయకుండానే ఏకంగా మెజర్మెంట్ రికార్డు (ఎంబీ) బుక్‌లో పనులు పూర్తి చేసినట్లు పేర్కొంటూ బిల్లులు పెట్టగా మంజూరు చేశారు. ఈ విషయంలో ఇంజినీర్లు కాంట్రాక్టర్ కుమ్మక్కై నకిలీ బిల్లులు సృష్టించి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారు. సింగరేణి కాలనీ వాంబే క్వార్టర్స్‌లో అధికారులు సీసీ రోడ్డు వేసినట్లుగా చెబుతున్న ప్రాంతానికి సంబంధించిన ఫొటోలు, వీడియో, సీసీ కెమెరాల ఫుటేజ్, రికార్డులను కమిషనర్‌కు అందజేశారు. ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేయడాన్ని సీరియస్‌గా తీసుకున్న కమిషనర్ ఆర్ వీ కర్ణన్ బాధ్యులపై చర్యలు తీసుకున్నారు. ఈ తరహా పాతబస్తీలో ఎక్కువగా జరుగుతున్నాయని, కమిషనర్ చొరవ తీసుకుని విచారణకు ఆదేశించాలని పలువురు కోరుతున్నారు.

## పశువులకు అధునాతన చికిత్స అవసరం

### వెటర్నరీ వర్సిటీ వీసీ జ్ఞాన ప్రకాష్

వ్యవసాయ యూనివర్సిటీ, (హైదరాబాద్ ): నూతన టెక్నాలజీతో పశువులలో వచ్చే రోగాలను నయం చేయడంతో పాటు పశు సంపదను కాపాడుకోవచ్చని పీవీ నర్సింహారావు వెటర్నరీ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ జ్ఞాన ప్రకాష్ అన్నారు. గురువారం రాజేంద్రనగర్‌లోని యూనివర్సిటీ పరిధిలో అధునాతన టెక్నాలజీ గల ఆస్పత్రి భవనంలో ఏర్పాటు చేసిన 2 రోజుల దేశవ్యాప్త సదస్సులో శాస్త్రవేత్తలు, డాక్టర్స్ పాల్గొన్నారు. పశువుల బ్రెయిన్‌లో రక్త ప్రసరణ డిసీజెస్ తదితర అంశాలపై ఆర్గనైజర్ డైరెక్టర్ సయ్యద్ అమిత్ భాష, రామకృష్ణమూర్తి తదితరులు అవగాహన కల్పించారు. యూనివర్సిటీ డిన్నర్ ఫ్యాకల్టీ డాక్టర్ ఉదయ్ కుమార్, డాక్టర్ మాధురి, రిటైర్డ్ న్యూరో సర్జరీ నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాజారెడ్డి, ఆస్పత్రి హెడ్ డాక్టర్ కే రామచంద్రారెడ్డి, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

### కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సిటీ బ్యూరో, జూన్ 12 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ పాఠశాలల్లో నిపుణులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య లభిస్తుందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. గురువారం గోల్కొండ మండలంలోని లంగర్‌హౌస్ సయ్యద్ ముర్తుజా హుస్సేని మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల పునఃప్రారంభం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పాఠశాలల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రభుత్వం నుంచి అందించే యూనిఫామ్స్, పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈఓ ఆర్ రోహిణి, డిప్యూటీ ఈవో వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఐఓఎస్ బషీర్, తహసీల్దార్ అహల్య, ప్రధానోపాధ్యాయులు ఫర్హాతున్నిసా, రోఖియా తస్లీమ్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



తీగల రంజిత్‌రెడ్డి భౌతికకాయానికి నివాళి అర్పిస్తున్న సబితారెడ్డి తదితరులు

# రంజిత్ రెడ్డి మరణం తీరని లోటు

### మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

బడంగ్ పేట్, జూన్ 12: మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట్ మాజీ ఎంపీటీసీ తీగల రంజిత్‌రెడ్డి మృతిచెందారు. మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, రాజేంద్రనగర్ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి వివిధ పార్టీల నాయకులు గురువారం రంజిత్‌రెడ్డి భౌతికకాయానికి నివాళులు అర్పించారు. రంజిత్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. సబితారెడ్డి మాట్లాడుతూ.. రంజిత్‌రెడ్డి మరణం నిరుపేదలకు తీరని లోటన్నారు. కాగా రంజిత్‌రెడ్డి రెండు సార్లు మీర్‌పేట ఎంపీటీసీ పనిచేశారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు అర్కల కామేష్ రెడ్డి, సిద్దాల లావణ్య బీరప్ప, అర్కల భూపాల్ రెడ్డి, దిండు భూపేష్ గౌడ్, మేకల రవీందర్ రెడ్డి, అనిల్ యాదవ్, దీప్లాల్ చౌహాన్, సిద్దాల అంజయ్య, పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, అశోక్, ఎల్చాల సుదర్శన్ రెడ్డి, రామిడి రామిరెడ్డి, పెద్దబావి ఆనంద్ రెడ్డి, సమ్ రెడ్డి వెంకట్ రెడ్డి, రాజుకుమార్, వీర రాఘవరెడ్డి, మహిళా అధ్యక్షురాలు సునీత, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మధుమేహంపై అవగాహన అవసరం

### కిమ్స్ హాస్పిటల్స్ కన్సల్టెంట్, ఎండోక్రినాలజిస్ట్ డా.కృష్ణారెడ్డి



సిటీబ్యూరో, జూన్12 (నమస్తే తెలంగాణ): మన దేశంలో నేటికీ సుమారు 5 కోట్ల మంది ప్రజలు తమకు మధుమేహం ఉందన్న సంగతి తెలియకుండానే జీవిస్తున్నారు. మధుమేహ ప్రబలత 11.4% కాగా, సుమారు 10.1 కోట్ల మంది ప్రజలు మధుమేహంతో బాధపడుతున్నారు. యువతలో కూడా ఈ వ్యాధి వేగంగా వ్యాప్తిచెందడం ఆందోళనను కలిగిస్తుంది. మానవ శరీరంలో కార్బొహైడ్రేట్లును సరైన విధంగా ప్రాసెస్ చేయలేకపోవడం వలన ఏర్పడే ఇన్సులిన్ లోపం లేదా ఇన్సులిన్ రెసిస్టెన్స్ వల్ల ఇది ఏర్పడుతుంది. దీనివల్ల రక్తంలో చక్కెర స్థాయి (హైపర్ గ్లైసీమియా) పెరిగి అనేక రకాల సమస్యలకు దారితీస్తుంది. కొండాపూర్ కిమ్స్ హాస్పిటల్స్ కన్సల్టెంట్, ఎండోక్రినాలజిస్ట్ డా. తాడూరి కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ప్రజల్లో చక్కెర పరీక్షపై (షుగర్ టెస్ట్) అవగాహన పెంచడంతో పాటు జీవనశైలిలో మార్పు, వ్యాయామం, జాగింగ్, క్రీడలు, కార్డియో వర్కౌట్స్, ఆహార నియంత్రణ, ప్రొటీన్లు, ఫైబర్ ఎక్కువగా తీసుకుని, కార్బొహైడ్రేట్లు, కొవ్వు తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. శరీర బరువు 5-10% తగ్గించాలి, ప్రతి రోజు 7-9 గంటలు నిద్రపోవాలని అన్నారు. కొలవండి, గమనించండి, నియంత్రించండి అనే 3 ముఖ్యమైన సూత్రాలను పాటించడం ద్వారా మధుమేహాన్ని సమర్థవంతంగా నియంత్రించవచ్చని కృష్ణారెడ్డి తెలిపారు.

# తెలంగాణ స్పీకర్‌తో యూపీ స్పీకర్ భేటీ

హైదరాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌తో ఉత్తరప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ సతీశ్ మహానా సమావేశం అయ్యారు. హైదరాబాద్ పర్యటనకు విచ్చేసిన సతీశ్‌మహానా దంపతులు గురువారం బంజారాహిల్స్ మంత్రుల నివాసంలోని రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అధికారిక నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఇరు రాష్ట్రాల అసెంబ్లీ నిర్వహణపై చర్చించారు. అనంతరం ఉత్తరప్రదేశ్ స్పీకర్ దంపతులను ప్రసాద్‌కుమార్ సన్మానించారు. అసెంబ్లీ సెక్రటరీ డాక్టర్ వీ నర్సింహాచార్యులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న ఫుడ్ సేఫ్టీ దాడులు

### నిబంధనలు పాటించని 10 షాపుల లైసెన్స్‌లు రద్దు



బాలాజీ మిఠాయి దుకాణాన్ని సీజ్ చేసిన సిబ్బంది. ఇన్‌సెట్‌లో దుకాణానికి వేసి సీల్

సిటీబ్యూరో, జూన్ 12 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ పరిధిలో నిబంధనలు పాటించని స్వీట్ షాపులు, బేకరీలపై ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు కొనసాగుతున్నాయి. సర్కిల్‌కి 5 చొప్పున స్పెషల్ డ్రైవ్ చేపట్టి నిబంధనలను పాటించని వారిపై కఠినంగా వ్యవహరించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ఫుడ్‌సేఫ్టీ విభాగానికి ఆదేశాలు జారీ చేసిన దరిమిలా ఇప్పటివరకు 69 షాపులలో అధికారులు తనిఖీలు చేపట్టారు. నగరంలో పలు సర్కిళ్లలోని దుకాణాలలో తనిఖీలు నిర్వహించగా.. ఆయా దుకాణాల్లో ఎక్కువగా ఎక్స్‌పైర్ అయిన ఫుడ్ ఇంగ్రీడియంట్స్ వాడుతున్నట్లు అధికారులు గుర్తించారు. మెజార్టీ స్వీట్ షాపులలో అమ్ముతున్న వస్తువులకు ఎలాంటి లేబుల్, ఎక్స్‌పైరీ డేట్ లేదని తేలింది. కిచెన్‌లో పనిచేసే వారు హెడ్ క్యాప్స్, యాప్రాన్స్, గ్లౌజ్‌లు లేకుండా, కీటకాలను నిరోధించడానికి కిటికీలకు మెష్‌లు అమర్చడం లేదని తేల్చారు. ఈ నేపథ్యంలోనే 10 వ్యాపార సంస్థలను సీజ్ చేయడంతో పాటు వాటి లైసెన్స్‌లు రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.

# 14.5 లక్షల ఉల్లంఘనలు..!

- ట్రాఫిక్ కేసుల తీరిది..
- టాప్‌లో వితవుట్ హెల్మెట్, రాంగ్‌సైడ్ డ్రైవింగ్..
- 900 రోడ్డు ప్రమాదాలు.. 34 మంది మృతులు



సిటీబ్యూరో, జూన్2(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగర రోడ్లపై ట్రాఫిక్ పెరిగిపోతోంది. ఏ చౌరస్తా చూసినా వాహనాలతో కిక్కిరిసిపోతుంది. అయితే కొంతమంది వాహనదారులు చేస్తున్న తప్పుల వల్ల తోటి వాహనదారులు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి వచ్చింది. ఇలాంటి వారిపై పోలీసులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నా వారిలో మాత్రం మార్పు కనిపించడం లేదు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లిహిల్స్, ఖైరతాబాద్, హిమాయత్‌నగర్, సికింద్రాబాద్ తదితర ప్రాంతాల్లో రోడ్లు విశాలంగా ఉన్నప్పటికీ ట్రాఫిక్‌జామ్‌లు తప్పడం లేదు. వాహనాల రద్దీ కంటే ట్రాఫిక్ ఉల్లంఘనుల కారణంగానే ఈ పరిస్థితి తలెత్తుతున్నదని పోలీసులు చెబుతున్నారు. గతఏడాది కంటే ఈసారి 20శాతం కేసులు ఎక్కువగా నమోదయ్యాయి. ప్రధానంగా నగరంలో మొదటి ఐదు నెలల్లోనే 14లక్షల ట్రాఫిక్ ఉల్లంఘన కేసులు నమోదయ్యాయంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

### స్పెషల్ డ్రైవ్‌లున్నా ఫలితమేది..!

ట్రాఫిక్ పోలీసులు ఎన్ని అవగాహనాకార్యక్రమాలు చేపట్టినా, ఎన్ని స్పెషల్ డ్రైవ్‌లు చేపడుతున్నా ట్రాఫిక్ ఉల్లంఘనుల్లో మాత్రం మార్పు రావడం లేదు. ఈ ఏడాది నమోదైన కేసుల్లో టాప్ వన్‌లో వితవుట్ హెల్మెట్‌కేసులే సుమారుగా పదిలక్షల వరకు నమోదయ్యాయి. ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్ వల్ల ప్రాణాలు కాపాడుకునే విషయం గురించి ట్రాఫిక్ పోలీసులు వందలాది అవగాహన సదస్సులు నిర్వహించారు. ట్రాఫిక్ ఉల్లంఘనలకు సంబంధించి పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వారిపై చర్యలు తీసుకుంటున్నారు. ఒకవైపు ట్రాఫిక్ కేసులు ఎన్ని నమోదవుతున్నా నగరంలో కేసుల సంఖ్య మాత్రం రోజురోజుకూ పెరుగుతోంది. వాహనాదరులు ఉల్లంఘనలను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఈ సంవత్సరం జనవరి నుంచి ఇప్పటివరకు 14.5లక్షల కేసులు నమోదయ్యాయి. ఈ 5నెలల్లో సుమారు 900కు పైగా రోడ్డు ప్రమాదాలు జరగగా అందులో హెల్మెట్ లేకుండా జరిగి మరణించినవి 25కు పైగా ఉన్నాయి. మైనర్ డ్రైవింగ్ వల్ల 12 మంది మృతి చెందినట్లు పోలీసులు చెబుతున్నారు. రాంగ్‌సైడ్ డ్రైవింగ్ జరిగే ప్రదేశాలను 58 గుర్తించారు.

**టాప్ కేసులివే..!**

| | |
|---|---|
| వితవుట్ హెల్మెట్ | -10,13,364 |
| రాంగ్‌సైడ్ డ్రైవింగ్ | -2,18,666 |
| సిగ్నల్ జంపింగ్ | -54,168 |
| త్రిబుల్ రైడింగ్ | -53,194 |
| ఓవర్‌స్పీడ్ | -47,658 |
| సెల్‌ఫోన్ డ్రైవింగ్ | -25,135 |
| డ్రంకెన్ డ్రైవ్ | -21,656 |
| నెంబర్‌ప్లేట్ | -27,631 |
| వితవుట్‌సీట్‌బెల్ట్ | -15,204 |
| ఎక్స్‌ట్రా ప్యాసింజర్స్ | -4,835 |
| మైనర్ డ్రైవింగ్ | -1,983 |